సాక్షి
అనకాపల్లి
బుధవారం । 11 । జనవరి । 2023



'రైవాడ'లో 3 లక్షల చేప పిల్లలు విడుదల

రైవాడ జలాశయంలో మూడు లక్షల చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు.

IIలో



చార్జీల బాదుడుపై కొరడా!

సంక్రాంతిని 'పండగ' చేసుకునే ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా ఝుళిపిస్తోంది.

IIలో

వాతావరణం

అనకాపల్లిటౌన్ : రాగల అయిదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి తెలిపారు. ఉష్ణోగ్రతలు 29.8 నుంచి 30.0 డిగ్రీలు. గాలిలో తేమశాతం 70 నుంచి 73. గాలి గంటకు 3 నుంచి 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

పారిశ్రామిక పరుగులు

- ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- కోడూరులో ఎంఎస్ఎంఈ, ఆటోనగర్‌ల ఏర్పాటు
- 60 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు
- 70 ఎకరాల్లో ఆటోనగర్
- రూ.36 కోట్ల బడ్జెట్‌తో పార్క్‌లో సౌకర్యాల కల్పన
- తొలిదశలో 59 ఎకరాల్లో అభివృద్ధి
- మొదటి విడత రూ.13 కోట్లతో మౌలిక వసతులు
- టెండర్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ
- మూడున్నరేళ్లలో రెట్టింపైన ఎంఎస్ఎంఈలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: జిల్లా పారిశ్రామికంగా పరుగులు పెడుతోంది. గతంలో గ్రామీణ, వ్యవసాయ ప్రాంతంగా గుర్తింపు పొందిన అనకాపల్లి, పరిసర ప్రాంతాలు పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందనున్నాయి. ఎక్కువమందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా అనకాపల్లి వద్ద భారీ ఎంఎస్ఎంఈ పార్కును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కోడూరు గ్రామంలో సుమారు 60 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు, 70 ఎకరాల్లో ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తోంది. తొలిదశలో 59 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం రూ.36 కోట్లతో పార్క్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతగా సుమారు రూ.13 కోట్ల వ్యయంతో రహదారులు, డ్రైనేజీ, వర్షం నీరు వెళ్లేందుకు కాలువలను నిర్మించనున్నారు. ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానించింది. టెండర్లు దక్కించుకున్న సంస్థ 12 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఆసక్తి గల సంస్థలు జనవరి 17లోగా బిడ్లను సమర్పించేలా ప్రకటనలు కూడా విడుదల చేసింది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ ఎంఎస్-సీడీపీ ప్రోగ్రాం కింద పార్కును అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు కూడా ఇప్పటికే పంపించారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

జిల్లాలో 7.5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను(ఎంఎస్ఎంఈ)లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఎంఎస్ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు సత్ఫలితాలనిస్తోంది. గత సర్కారు ఎగ్గొట్టిన రూ.962.05 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను చెల్లించడమే కాకుండా, రాయితీలను ఎప్పటికప్పుడు అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,715.16 కోట్ల రాయితీలను, రూ.1,144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను చెల్లించింది.



పారిశ్రామిక పార్క్ నమూనా

జిల్లాలో వివరాలు...

జిల్లాలో భారీ పరిశ్రమలు : 109		
మొత్తం పెట్టుబడులు : రూ.30,598 కోట్లు	ఉపాధి పొందుతున్నవారు : 50,371 మంది	ఎస్ఈజెడ్ : పరవాడ, అచ్యుతాపురం ప్రాంతం
కొత్తగా రానున్న భారీ పరిశ్రమలు 35	వీటికి మొత్తం పెట్టుబడి : రూ.18,752 కోట్లు	ఉపాధి అవకాశాలు : 24,869 మందికి
ఇంతవరకూ రిజిష్టర్ అయిన ఎంఎస్ఎంఈలు : 5,372	పెట్టుబడి : రూ.1, 831 కోట్లు	ఉపాధి పొందుతున్న వారు : 52,352 మంది

రెండు లక్షల మందికి ఉపాధి



జిల్లాలో వివిధ పరిశ్రమల ద్వారా ఇప్పటికే సుమారు రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుతో అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించవచ్చు. కోడూరులో గల ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు టెండర్ పిలిచాం. మూడున్నరేళ్లలో ఎంఎస్ఎంఈలు జిల్లాలో రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 5372 సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. కొత్తగా మరో 35 భారీ పరిశ్రమలు రానున్నాయి.

– శ్రీధర్, జీఎం, డీఐసీ, జిల్లా పరిశ్రమల శాఖ

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- రాయితీపై మోటారు సైకిళ్ల పంపిణీ



మత్స్యకారులకు మోటారు సైకిళ్లను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో భాగంగా మంజూరైన టీవీఎస్ మోటారు సైకిళ్లను 17 మంది మత్స్యకారులకు మారేపల్లిలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలను మార్కెట్‌కు సకాలంలో తీసుకెళ్లి విక్రయించుకునేందుకు ద్విచక్ర వాహనాలతో పాటు చేపలను నిల్వ చేసేందుకు ఐస్ బాక్స్‌లను సైతం అందజేసినట్టు చెప్పారు. మాడుగుల మత్స్యశాఖ అధికారి ఎం.ఆర్. ఆశాజ్యోతి మాట్లాడుతూ పీఎంఎంఎస్‌వై స్కీమ్ ద్వారా మత్స్యకారులకు అందజేస్తున్న ఈ యూనిట్ ధర 75 వేలు కాగా, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీపైన, జనరల్ కేటగిరీల వారికి 40 శాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. రాయితీ పోను ఎస్సీ, ఎస్టీలు రూ.30 వేలు, జనరల్ కేటగిరీకి చెందిన మత్స్యకారులు రూ.45 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, వైస్ ఎంపీపీలు ఉగ్రాకుల గంగాభవానీ, చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి, ఉప సర్పంచ్ రొంగలి కన్నంనాయుడు వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

- ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: జూనియర్ కాలేజీలకు బుధవారం నుంచి ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆర్.సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు తప్పనిసరిగా బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలన్నారు. సంక్రాంతి సెలవుల్లో ఎటువంటి తరగతులను నిర్వహించడానికి వీల్లేదన్నారు. ప్రైవేటు కాలేజీలపై నిఘా పెట్టామని, ఎక్కడైనా ప్రత్యేక తరగతులను నిర్వహించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్యాబ్‌ల వినియోగంపై పూర్తి స్థాయి అవగాహన



మాట్లాడుతున్న విశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి

కశింకోట: ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ విశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి ఆదేశించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో మంగళవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో నాణ్యమైన విద్యా బోధనపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ట్యాబ్ వినియోగాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని, నోట్స్, వర్క్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులుంటే సరిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా బోధన, ఎంఈవోల పర్యవేక్షణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యా శాఖ అధికారులు బి.లింగేశ్వరరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రాజెక్టులు

- డీఈవో లింగేశ్వరరెడ్డి



ఏటీఎల్ హబ్‌లో నమూనాలను పరిశీలిస్తున్న డీఈవో లింగేశ్వరరెడ్డి

కె.కోటపాడు : సైన్స్ పాఠ్యాంశాలకు అనుగుణంగా విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలోని 28 ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జ్‌లకు ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల అటల్ టింకరింగ్ ల్యాబ్ హబ్‌లో మంగళవారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపు నిర్వహణ తీరును డీఈవో లింగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించి, వారిని అభినందించారు. హైస్కూల్‌లో మొదటి విడతలో జరిగిన నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించి హెచ్‌ఎం అనురాధను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎల్ హబ్ ట్రైనర్ నాయుడు, జిల్లా సైన్స్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్

పాయకరావుపేట: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక కె.హెచ్.వాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం, మరో ముగ్గురు ఉపాధ్యాయులకు ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన మంగళవారం ఈ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం బి.సుందరరావు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎం.రమణ రాజు, పద్మావతిల పనితీరు సక్రమంగా లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎంఈవో కె.ఎస్.గాంధీ తెలిపారు. పాఠ్యాంశాల బోధన ప్రణాళిక, టైం టేబుల్ తదితర వాటిని సక్రమంగా నిర్వహించడం లేదని, దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఎంఈవో చెప్పారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు కూడా సక్రమంగా లేదని ఎంఈవో తెలిపారు.

టీడీపీ నాయకుడి భూ దందా



ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

- 100 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- జాయింట్ కలెక్టర్‌కు చిన భీమవరం గ్రామస్తుల ఫిర్యాదు

బుచ్చెయ్యపేట : మండలంలోని చిన భీమవరం టీడీపీ నాయకుడు వెలంకాయల అప్పలనాయుడి భూ కబ్జాపై గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ హయాంలో అప్పలనాయుడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేరున ఆన్‌లైన్ చేయించుకుని ఫలసాయం అనుభవిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన పడమటమ్మ గుడి దగ్గరలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో 100 ఎకరాల భూమిని టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని అనుభవిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న 173 సర్వే నంబరులో అప్పలనాయుడు పేరుపై 12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో ఉన్న బొడ్డేటి సన్యాసిరావు, మలిచెట్ల సరోజిని, ఆదాడ కాశమ్మ తదితర బినామీ పేర్లపై, వారి కుటుంబ సభ్యుల పేర్లపై వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అనుభవిస్తున్నారని గ్రామ ఉప సర్పంచ్ వెలుగుల రాజారావు, వార్డు మెంబర్లు రాజాన చిన అప్పలనాయుడు, గొంతిన చిలకరాజు, నాయకులు పువ్వుల సతీష్, కాలపురెడ్డి అప్పారావు, సేనాపతి రమణాజీ, అప్పలనాయుడు, మాధవి తదితరులు జేసీకి ఫిర్యాదు చేశారు. ఒకే వ్యక్తికి వందల ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార్లు ఎలా కట్టబెట్టారని, స్థానికేతరులు, బడా బాబులు ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. తక్షణం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, గ్రామంలో ఉన్న నిరుపేదలకు పట్టాలు అందించాలని జేసీకి అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అడుగులు

- మరింత పక్కాగా జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలుకు సన్నాహాలు
- ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు శిక్షణ
- సంక్రాంతి తరువాత ప్రారంభం
- జిల్లాలో మూడు కేంద్రాల ఎంపిక



నక్కపల్లి శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ తదితరులు

నక్కపల్లి: క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జగనన్న స్వచ్ఛసంకల్పంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యదర్శులను భాగస్వాములను చేయాలని, వారికి దశలవారీగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ శిక్షణ కోసం జిల్లాలో ఎనిమిది మండలాలకు ఒకటి చొప్పున మూడు కేంద్రాలను ఎంపిక చేశారు. ఇక్కడ ఆయా మండలాల పరిధిలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, క్లాప్ మిత్రల(స్వీపర్లు)కు జనవరి మూడో వారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో నక్కపల్లి, కశింకోట, చీడికాడ మండల కేంద్రాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇస్తారు. తడి పొడి చెత్త వేరు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయడం, ఘన వ్యర్థ పదార్థాల నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి రీసైక్లింగ్ చేసి రోడ్ల నిర్మాణంలో ఉపయోగించడం, వర్మీ కంపోస్టు తయారీ, విక్రయాలు తదితర అంశాలపై వీరికి శిక్షణ ఇస్తారు. డెమో కోసం ఇక్కడ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. శిక్షణ పొందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్వీపర్లు, కార్యదర్శులు వారివారి గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛసంకల్పం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా క్లీన్ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో తడిపొడి చెత్తను తరలించేందుకు ప్రతీ పంచాయతీకి మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేసింది. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో అన్ని శాఖలను భాగస్వాములను చేసి అవగాహన కార్యక్రమాలు ర్యాలీలు నిర్వహిస్తోంది. ఎంపికైన శిక్షణ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, యలమంచిలి, నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట మండలాలకు నక్కపల్లిలో శిక్షణ ఇస్తారు.

శిక్షణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు



క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్‌లోని ఎనిమిది మండలాలకు నక్కపల్లి బోదిగల్లం రోడ్డులో ఉన్న కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులతోపాటు స్వీపర్లకు కూడా శిక్షణ ఇస్తారు. సంక్రాంతి తర్వాత శిక్షణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. డెమో ద్వారా శిక్షణ ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి

సంక్రాంతి స్పెషల్స్ రెడీ!



- 550 బస్సులను నడవనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి మొదలైన సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు
- అడ్వాన్స్ టిక్కెట్ రిజర్వేషన్లకు డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ **ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది.** ఈ పండగకు వివిధ **ప్రాంతాల నుంచి వచ్చే, వెళ్లే వారి** కోసం విశాఖ నుం**చి 550 స్పెషల్ బస్సులను నడప**నుంది. సంక్రాంతి**కి హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర** జిల్లాలకు వచ్చే **వారి సంఖ్య అధికంగా ఉంటుంది.** హైదరాబాద్ నుం**చి రోజుకు ఐదు రెగ్యులర్ బస్సులు** నడుస్తున్నాయి. **వీటిలో రోజుకు 177 చొప్పున ఉన్న** సీట్లు ఈ నెల 13వ తేదీ వరకు నూరు శాతం భర్తీ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం నుంచి కొన్ని స్పెషల్ బస్సులను హైదరాబాద్ పంపారు. మంగళవారం అక్కడ నుంచి ఇవి బయలుదేరాయి. హైదరాబాద్ నుంచి 14వ తేదీ వరకు 35 స్పెషల్ బస్సులను అందుబాటులో ఉంచింది. వీటిలో 90 శాతానికి పైగా సీట్లు ఇప్పటికే అడ్వాన్సు రిజర్వేషను చేయించుకున్నారు. మరోవైపు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. వీటిలో సీట్ల కోసం అడ్వాన్సు రిజర్వేషన్లు జరుగుతున్నాయి. ఇవికాకుండా రెగ్యులర్‌గా రోజుకు ఐదు బస్సులు ఇక్కడ నుంచి నడుస్తున్నాయి. వీటిలో చాలావరకు సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి.

ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి..

హైదరాబాద్‌తో పాటు విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, భీమవరం, పార్వతీపురం, **పలాస, ఇచ్ఛాపురం, సోంపేట తదితర ప్రాంతాలకు నడపడానికి ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను సిద్ధం చేశారు. రెగ్యులర్ బస్సులకు మించి ప్రయాణికులుంటే ప్రత్యేక బస్సులు నడుపుతారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి బుధవారం** నుంచే వీటిని నడపడానికి చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) అప్పలరాజు 'సాక్షి'తో చెప్పారు. ఈసారి స్పెషల్ బస్సుల్లో మునుపటిలా టిక్కెట్టుపై 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయడం లేదని, ఇది ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశమని తెలిపారు.

గత సంక్రాంతి కంటే ఎక్కువ స్పెషల్స్

గత సంక్రాంతికి అప్పటి విశాఖ రీజియన్ నుంచి 492 ప్రత్యేక బస్సులను నడిపారు. అప్పటికి కోవిడ్ మూడో వేవ్ పూర్తిగా తొలగకపోవడంతో ప్రయాణికుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం కోవిడ్ ఛాయలు లేకపోవడంతో మళ్లీ సాధారణ పరిస్థితికి వచ్చింది. దీంతో గత సంక్రాంతి కంటే ఈసారి ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాదికన్నా 68 స్పెషల్ బస్సులను పెంచారు.

సంక్రాంతికి ఎక్కడకు ఎన్ని స్పెషల్ బస్సులు?

ఎక్కడకు	2022	2023
అమలాపురం	6	9
బీహెచ్ఈఎల్	38	40
భీమవరం	7	4
ఇచ్ఛాపురం	10	20
కాకినాడ	16	20
పాలకొండ	53	55
పలాస	32	35
పార్వతీపురం	87	90
రాజమండ్రి	65	75
రాజాం	17	20
రాజోలు	2	2
సాలూరు	7	10
శ్రీకాకుళం	73	75
విజయవాడ	53	65
విజయనగరం	19	20
సోంపేట	7	10
మొత్తం	492	550

పండగ ప్రయాణికులకు 10శాతం రాయితీ

నర్సీపట్నం : సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లా నుంచి నడిపేందుకు ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. ఒకేసారి రానూపోను టిక్కెట్లు బుక్ చేస్తే తిరుగు ప్రయాణం టిక్కెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నారు. పండగకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను అందుబాటులో ఉంచారు. సాధారణ టికెట్ చార్జీతోనే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాలోని రెండు డిపోల నుంచి 23 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 13 నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నాలకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ సర్వీసులు 20వ తేదీ వరకు అందుబాటులో ఉండనున్నాయి. ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్ బుకింగ్‌కు అనుగుణంగా జిల్లాలోని రెండు డిపోల్లో ప్రత్యేక సర్వీసులను అవసరమైన మేరకు పెంచుకుంటూ వెళ్లనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం డిమాండ్ అంతగా లేనప్పటికీ షెడ్యూల్ సర్వీసుల్లో 50 శాతం పైగా సీట్లు నిండినట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చిన తర్వాత, ఈ నెల 12 సాయంత్రం నుంచి రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ



మేరకు సన్నద్ధంగా ఉన్నారు. నర్సీపట్నం నుంచి హైదరాబాద్ 4, విజయవాడ 1, నర్సీపట్నం-విశాఖపట్నం 5, అనకాపల్లి-విశాఖపట్నం మీదుగా 8 అదనపు సర్వీసులను నడుపుతున్నారు.

టిక్కెట్ బుకింగ్‌పై డిస్కౌంట్



బస్సుల్లో రానూపోనూ ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్లు బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణ టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం. పండగ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో టికెట్ చార్జీలో 50 శాతం అదనపు భారం ప్రయాణికులు చెల్లించాల్సి వచ్చేది. ఈసారి అదనపు చార్జీ ఉండదు. సాధారణ టికెట్ చార్జీతోనే ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాం.

– కె.పద్మావతి, జిల్లా ప్రజా రవాణా అధికారిణి

క్లుప్తంగా

సీఏ ఫలితాల్లో మునగపాక విద్యార్థిని ఉత్తీర్ణత



తల్లిదండ్రులతో భావన

మునగపాక: చార్టెడ్ అకౌంటెంట్(సీఏ) ఫైనల్ ఫలితాల్లో మునగపాక గ్రామానికి చెందిన ఆడారి భావన ఉత్తీర్ణత సాధించింది. కష్టపడి చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించగలమని ఆమె నిరూపించింది. గ్రామానికి చెందిన వెంకట సన్యాసిరావు–జయలక్ష్మి దంపతుల కుమార్తె భావన ఇటీవల సీఏ పరీక్షలకు హాజరైంది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సీఏగా ఉత్తీర్ణత సాధించడంతో తల్లిదండ్రుల తోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భావన తండ్రి సన్యాసిరావు స్పెషల్ బ్రాంచి ఏఎస్ఐగా అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాట శిబిరం వద్ద పట్టుబడిన మోటార్ సైకిళ్లు, నగదు, జూదరులతో పోలీసులు

ఎస్.రాయవరం: దార్లపూడి శివారులో పేకాట శిబిరంపై మంగళవారం దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్నవారిని పట్టుకున్నామన్నారు. ఇందులో కొందరు పరారవ్వగా నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నామన్నారు. శిబిరం వద్ద రూ.56, 240, 11 మోటార్ సైకిళ్లు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

చార్జీల బాదుడుపై కొరడా!

- రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్
- 17 వరకు ప్రైవేటు బస్సుల తనిఖీలు
- నిబంధనల ఉల్లంఘనపై కేసులు

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతిని 'పండగ' చేసుకునే ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా ఝుళిపిస్తోంది. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య విపరీతంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు ఆపరేటర్లు బస్సులను నడుపుతుంటారు. ఈ బస్సుల్లో సాధారణం కంటే అధిక చార్జీలను వసూలు చేస్తుంటారు. సంక్రాంతికి వచ్చే అధిక ఆదాయాన్ని వదులుకోలేక తగిన ధృవపత్రాలు లేకుండా, ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించకుండా బస్సులను తిప్పుతుంటారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారులు తొక్కే ప్రైవేటు ట్రావెల్స్‌కు అడ్డుకట్ట వేయడానికి రవాణాశాఖ అధికారులు దాడులు చేస్తున్నారు. ఈనెల 9వ తేదీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో లగేజీ రవాణా చేస్తున్నా, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నా కేసులు పెడుతున్నారు. ఇంకా ఈ ట్రావెల్స్ బస్సుల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. సంబంధిత బస్సుకు ట్యాక్స్‌లు చెల్లించారో లేదో చూస్తున్నారు. అలా చెల్లించని బస్సులను సీజ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సు ఆపరేటర్లకు రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడుల నుంచి విశాఖపట్నం వైపు వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను అగనంపూడి టోల్ ప్లాజా వద్ద విశాఖ జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రతి రోజూ సాయంత్రం నుంచి మర్నాడు ఉదయం వరకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఇందుకోసం రవాణా శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న 35 బస్సులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తిప్పుతున్న మూడు బస్సులను సీజ్ చేశారు. రూ.2.63 లక్షల జరిమానా విధించి వసూలు చేశారు. సంక్రాంతి పేరిట ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, అలాంటి వారు రవాణా శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ జీ.సి.రాజారత్నం కోరారు. ఈ తనిఖీలు ఈనెల 17వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.



అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

తైక్వాండో పోటీలకు చోడవరం క్రీడాకారులు

చోడవరం : జాతీయ స్థాయి తైక్వాండో క్యోరిగి రిఫరీ, రిఫ్రెషర్ సెమినార్, బ్లాక్ బెల్ట్ డాన్ పోటీలకు చోడవరం క్రీడాకారులు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖజిల్లా నుంచి 31 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో 11 మంది చోడవరానికి చెందినవారే ఉన్నారు. జిల్లా నుంచి 11మంది రిఫరీలు ఎంపిక కాగా అందులో 9 మంది చోడవరం వారే. గత కొన్నేళ్లుగా చోడవరం పరిసరాల్లో ఏపీ తైక్వాండో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి శిక్షణలో ఈ ప్రాంత యువతీ, యువకులు చాలా తైక్వాండోలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించారు. తాజాగా ఈ నెల 6 నుంచి 8 వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో చోడవరానికి చెందిన పలువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి, పతకాలు సాధించడంతోపాటు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు.

జాతీయస్థాయి బ్లాక్‌బెల్ట్ పోటీలకు వేపాడ చరణ్, ఆకుల ముఖేష్, గుద్దేటి నాగసాయిరామ్, మునస సంతోషిలక్ష్మి, సోనారి తన్వా, వెలుగుల లిఖిత, బొబ్బిలి సత్యరామచంద్ర, వెలుగుబండి లక్ష్మణ్, బాలియారు సింహాలసాయిప్రణయ్ కుమార్, ఎం. త్రినాథ్, ఎస్.ప్రసాద్ ఎంపికయ్యారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రిఫరీ, రిఫ్రెషర్ సెమినార్‌కు గండి మోహన్‌దివాకర్, శేఖర్‌బాబు, షేక్ అస్లామ్, కొర్రా చంటిబాబు, మునస సంతోషిలక్ష్మి, ఎం.త్రినాథ్, చంద్రశేఖర్, డి.జాహ్నవి, మద్దాల రంగారావు, వి.మేఘన భువనేశ్వరీ, సీహెచ్ పూజిత రెడ్డి ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పల్లం మురళీకృష్ణ చెప్పారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఎంపికైన వారిని తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ హర్షవర్ధన్ ప్రసాద్ అభినందించారు.

ఏడు గంటలు ఆలస్యంగా ఏపీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖపట్నంలో మంగళవారం రాత్రి 10గంలకు బయల్దేరవలసిన విశాఖపట్నం– న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు 5.30గంటలకు బయల్దేరుతుంది. మంగళవారం తెల్లవారు 4.10గంటలకు న్యూఢిల్లీ నుంచి విశాఖపట్నం రావలసిన పెయిరింగ్ రైలు సుమారు 18గంటలు ఆలస్యంగా మంగళవారం రాత్రి 10గంటలకు విశాఖ చేరుకుంది. ఈ రైలు నిర్వహణ అనంతరం దీనిని రీషెడ్యూల్ చేసి తెల్లవారు 5.30గంటలకు బయల్దేరుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

చేపల మృతిపై కేసు నమోదు

నర్సీపట్నం: గబ్బాడ చెరువులో చేపల మృతిపై మత్స్యకారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ రామారావు తెలిపారు. నర్సీపట్నం మండలం గబ్బాడ చెరువులో ఈ నెల 7వ తేదీన మూడు టన్నుల చేపలు మృతి చెందాయన్నారు. ఎవరైనా విష ప్రయోగం చేశారనే దానిపై విచారణ చేస్తున్నామన్నారు. మృతి చెందిన చేపలను విశాఖపట్నం మత్స్యశాఖ ప్రయోగశాలకు పంపించామని, రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

- జిల్లా ప్రజారవాణాధికారి పద్మావతి

నర్సీపట్నం: స్థానిక డిపో పరిధిలో ఖాళీగా ఉన్న 1.56 ఎకరాల స్థలాన్ని 15 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు అనకాపల్లి ఆర్టీసీ రీజినల్ మానటరింగ్ అధికారి పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ లీజు నోటిఫికేషన్ ఇప్పటికే విడుదలైందన్నారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం వరకు టెండర్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఉంచుతామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు డౌన్‌లోడు చేసుకుని పూర్తిగా నింపి, అవసరమైన డాక్యుమెంట్లు పొందుపరిచి ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం లోపు అప్‌లోడు చేయాలన్నారు. అదే రోజు టెండర్లను తెరుస్తారని తెలిపారు. ఖాళీ స్థలానికి నెలకు లీజు రూ.4 లక్షలుగా నిర్ణయించారని, దీనికి మించి టెండర్‌లో కోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. లీజు ఖరారు అయిన వ్యక్తి ప్రభుత్వానికి ముందుగా రూ.48 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. 15 ఏళ్ల తర్వాత స్థలాన్ని ఖాళీ చేయాలని చెప్పారు. టెండర్ విధి, విధానాలపై ఈ నెల 13న అనకాపల్లి రీజినల్ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. ఆసక్తి గల వారు అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ ధీరజ్ పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలో 3 లక్షల చేప పిల్లలు విడుదల

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో మూడు లక్షల చేప పిల్లలను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా ప్రత్యేక వాహనాల్లో తీసుకువచ్చిన బొచ్చె, రాగండి, ఎర్రమైల రకాల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారుల సమక్షంలో విడుదల చేశారు. గతేడాది నవంబర్ 8న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి జలాశయంలో ఆరు లక్షల చేప పిల్లలను విడుదల చేసిన విషయం విదితమే. స్థానిక మత్స్యకారులు అదనంగా చేప పిల్లలు వేయాలని డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేయగా, ఆ మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మూడు లక్షల చేప పిల్లలను విడుదల చేయడంతో హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉ్రరాకుల గంగాభవానీ, సర్పంచ్ చల్లా లక్ష్మి, ఉర్రాకుల అప్పారావు, చల్లా నాయుడు, మాడుగుల మత్స్యశాఖ అధికారి ఎంఆర్. ఆశాజ్యోతి, మత్స్యశాఖ సచివాలయ విలేజ్ అసిస్టెంట్లు కీర్తి, అప్పలపాత్రుడు, జ్యోతి, భారతి, మత్స్యకారులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజాలకు ఫాస్టాగ్

నక్కపల్లి: జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహన యజమానులు ఫాస్టాగ్ రీచార్జ్ తప్పని సరిగా చేయించుకోవాలని వేంపాడు(కాగిత) టోల్ ప్లాజా మేనేజర్ చిరంజీవినాయుడు తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి ఆటోమేటిక్ ఫాస్టాగ్ అనుసంధానం చేసినట్టు చెప్పారు. వాహనచోదకులు తప్పని సరిగా ఫాస్టాగ్ రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండు కంపార్ట్‌మెంట్లకు కలిపి సిబ్బంది ఉంటారన్నారు. అక్కడ ఉన్న మెషీన్ ఆటోమెటిక్‌గా స్కానింగ్ చేస్తుందని చెప్పారు. ప్రయాణిస్తున్న వాహనం టోల్‌ప్లాజా కంపార్ట్‌మెంట్ వద్దకు వచ్చే సరికి ఫాస్టాగ్‌లో టోల్‌ఫీజుకు సరిపడా మొత్తం ఉండాలన్నారు. అలా లేని పక్షంలో వాహనాన్ని కంపార్ట్‌మెంట్ నుంచి వెనక్కి పంపివేస్తామని, రీచార్జ్ అయిన తర్వాతే రాకపోకలకు అనుమతిస్తామని తెలిపారు. ఫాస్టాగ్ స్టిక్కర్ లేని వాహన యజమానులు డబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈవిషయాన్ని వాహన చోదకులు గమనించి టోల్‌ప్లాజా యాజమాన్యానికి సహకరించాలన్నారు. టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వాహన యజమానులు రూ.315లు చెల్లించి నెలవారీ పాసులు పొందవచ్చని చెప్పారు.



కాగిత వద్ద ఉన్న టోల్‌ప్లాజా

హరిపాలెంలో వివాహిత హత్య

- తానే చంపి, ఆత్మహత్యగా చిత్రీకరించేంచేందుకు ప్రయత్నం
- మృతురాలితో సహజీవనం చేస్తున్న వ్యక్తే నిందితుడు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని హరిపాలెంలో జరిగిన హత్య సంచలనంగా మారింది. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు ముందు అసలు నిజం చెప్పేయడంతో వాస్తవంలో వెనువెంటనే వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు ఏ. సత్యనారాయణ(47) కొద్ది నెలల క్రితం తనతో సహజీవనం చేస్తున్న ఉమాకుమారితో హరిపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. సత్యనారాయణ మొదటి భార్యకు కలిగిన సంతానంలో కుమార్తె, కుమారుడు విషయంలో సహజీవనం చేస్తున్న ఉమాకుమారికి, సత్యనారాయణకు తరచూ ఘర్షణలు జరిగాయి. దీంతో ఎలాగైనా ఉమాకుమారి అడ్డు తప్పించాలని సత్యనారాయణ మంగళవారం తెల్లవారు జామున తలగడను ముఖంపై పెట్టి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఉమా కుమారి(42) ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు చీరను ఫ్యాన్‌కు లాగి మృతురాలి మెడకు తగిలించాడు. అయితే అక్కడి పరిస్థితిపై అనుమానం వచ్చి పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిందితుడు వాస్తవం ఒప్పుకొని తానే చంపేశానని అంగీకరించాడు. హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మంచంపై అచేతన స్థితిలో పడి ఉన్న ఉమా కుమారి

మామపై అల్లుడి హత్యాయత్నం

అల్లిపురం (విశాఖ దక్షిణం): సొంత మామ, బావమరుదులపై ఇంటి అల్లుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరులరావు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం, నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన రూకూరి అప్పారావు ఫ్యాన్సీ షాపు నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆఖరి కుమార్తె లక్ష్మీభాయిని దువ్వాడకు చెందిన ఆకుల పూర్ణచంద్రరావుకు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నాళ్ల తరువాత పూర్ణచంద్రరావు తన భార్యను అనుమానించి వేధించేవాడు. దీంతో వారిద్దరి మధ్య విభేదాలు రావటంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో పిల్లల పోషణ నిమిత్తం డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీబాయి తన భర్తను అడిగింది. దీంతో పూర్ణచంద్రరావు అందుకు నిరాకరించాడు. పైగా సోమవారం ఉదయం తన మామగారింటికి వచ్చి అందర్నీ బెదిరించాడు. రాత్రి 10 గంటలకు మరోసారి పూర్ణచంద్రరావు మద్యం తాగి వచ్చి గొడవకు దిగాడు. ఇదంతా గమనించిన అప్పారావు కలుగజేసుకుని పూర్ణచంద్రరావును అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో నువ్వెవరు నాకు చెప్పడానికి అంటూ బీర్‌సీసాతో అప్పారావుతో పాటు, ఆయన కుమారుడు అయ్యప్పపై దాడి చేశాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే కూలబడిపోయారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్.ఐ విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన అప్పారావు, అయ్యప్పలను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు నిందితుడ్ని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పారావు

పేదలందరి ఇళ్లకు రూ.200 కోట్లు

- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో సంక్షేమం,అభివృద్ధికి పెద్ద పీట
- అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్
- మొత్తంగా 7 అంశాలకు ఆమోదం



వీఎంఆర్‌డీఏ సమావేశంలో చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, అధికా

దొండపర్తి (విశాఖ దక్షిణ): 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో లేఅవుట్ల అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) నిర్ణయం తీసుకుంది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అధ్యక్షతన సంస్థ సమావేశ మందిరంలో బోర్డు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇందులో ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఏపీఈపీడీసీఎల్ చైర్‌పర్సన్ కె.సంతోషరావు, డీటీసీపీ డైరెక్టర్ ఆర్.జె.విద్యుల్లత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు రూ.వందల కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి చేసేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. అలాగే మరోవైపు రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అంశాలపై కూడా చర్చించి మొత్తం ఏడు అంశాలకు ఆమోదముద్ర వేశారు.

- 'జగనన్న హరిత నగరాలు'లో భాగంగా ఎన్‌హెచ్–16 జంక్షన్ నుంచి పేబిల్ బీచ్ హౌసింగ్ జంక్షన్ (వయా లా కాలేజీ) వరకు 3.10 కిలోమీటర్ల పొడవున రహదారి అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు.
- జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్ పథకంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో చోడవరం మండలం అడ్డూరు గ్రామంలో 19.99 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధికి రూ.11.40 కోట్లు మంజూరు
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వివిధ మండలాల్లో రూ.200 కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి
- 'జగనన్న టౌన్‌షిప్ పథకం' పథకంలో భాగంగా విజయనగరం జిల్లా గరివిడి గ్రామంలో రూ.21.3 కోట్లతో 21.3 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధి
- రూ.1.98 కోట్లతో పెబుల్ బీచ్ అపార్ట్‌మెంట్ల నుంచి ఐటీ సెజ్ రోడ్డు వరకు 80 అడుగుల రహదారికి ఇరువైపులా అలంకారమైన ఎంఎస్ గ్రిల్, సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పథకంలో భాగంగా రూ.11 కోట్లతో విశాఖ జిల్లా పాలవలస గ్రామంలో 22.02 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్‌లో మౌలిక సదుపాయల అభివృద్ధి
- వీఎంఆర్‌డీఏ అమ్మకానికి ప్రతిపాదించిన 8 బల్క్ ల్యాండ్ ప్లాట్లను మెరుగైన విక్రయ సామర్థ్యం కల్పించేలా చిన్న బిట్‌లుగా విభజనకు పరిపాలన అనుమతులు.

ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు మంజూరు

- కేజీహెచ్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- ఓపీ కౌంటర్ వికేంద్రీకరణకు విశాఖ కలెక్టర్ ఆదేశాలు



మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున,చిత్రంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ అశోక్ కుమార్



హజరైన వైద్యులు, హెచ్‌ఓడీలు, ఇంజినీరింగ్ అధికారులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): నగరంలోని పలు ఆస్పత్రుల అభివృద్ధిపై విశాఖ కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు. మంగళవారం కేజీహెచ్ సమావేశ మందిరంలో కేజీహెచ్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ పలు మార్గదర్శకాలు జారీ చేశారు. కేజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. కేజీహెచ్‌కు సంబంధించి సూపరింటిండెంట్ అజెండా అంశాలను ప్రస్తావించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు, అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ మెషిన్ రావడానికి కొంత ఆలస్యం అవుతుందని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవుట్ సోర్సింగ్ ద్వారా సేవలను అందించాలన్నారు. పిడియాట్రిక్ వార్డులో పీజీ విద్యార్థులకు టాయిలెట్స్ కోసం రూ.4 లక్షలు, కేజీహెచ్‌లోని సుబ్బిరామిరెడ్డి సత్రం మరమ్మతులకు అనుమతి మంజూరు చేశారు. ఆస్పత్రి పవర్, వాటర్ బిల్ కోసం అధికంగా ఖర్చు అవుతోందని సూపరింటిండెంట్ కలెక్టర్‌కు తెలిపగా, సోలార్ పవర్ కోసం గత సమావేశంలోనే అనుమతి మంజూరు చేశామని, ఇంకా ఎందుకు పనులు చేపట్టలేదని కలెక్టర్ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి రూ.50 లక్షల, సీఎస్సార్ ద్వారా రూ.20 లక్షల ఇస్తున్నట్టు తెలిపారు. హెచ్‌పీసీఎల్ ద్వారా త్వరలోనే పది కొత్త అంబులెన్సులు కేజీహెచ్‌కు రానున్నాయన్నారు. యురాలజీ విభాగంలో యంత్రాల కొనుగోలుకు రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఓపీ కౌంటర్లను వికేంద్రీకరణ చేసి రోగులకు సౌకర్యవంతంగా ఉండేలా మార్చాలన్నారు. క్యాజువాలిటి వద్ద ఫౌంటేన్, గార్డెనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. సూపరింటిండెంట్ పేర్కొన్న పలు రకాల పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు వెంటనే ప్రతిపాదనలు పంపి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీహెచ్‌లో మొత్తం 28 పనులకు గాను రూ.2.98 కోట్లకు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారు.

ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రతి రోజు 300 మందికి ఓపీ సేవలు, 30 సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. గత సమావేశంలో కలెక్టర్ మంజూరు చేసిన జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తి అయినట్టు వివరించారు. అనంతరం కలెక్టర్ మొత్తం రెండు పనులకు గాను రూ.27 లక్షలు మంజూరు చేశారు.

ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉషా పేర్కొన్న అత్యవసర పనులకు కలెక్టర్ మల్లికార్జున అనుమతులు మంజూరు చేశారు. విక్టోరియా ఆస్పత్రిలో రెండు పనులకు గాను రూ.4.50 లక్షలకు అనుమతి ఇచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ బీఏ నాయుడు, కమిటీ సభ్యులు కుమార్ రాజా, ఆనంద్ సింఘ్, వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. మంగళవారం పెద వాల్తేరు ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఛాతి, ఈఎన్‌టీ, మానసిక, ఆర్‌సీడీ ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఆస్పత్రి అభివృద్ధి పనులకు పలు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశించారు. మంజూరు చేసిన పనులను త్వరితగతిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో మొత్తం 14 పనులకు రూ.16 లక్షలు, ఈఎన్‌టీ ఆస్పత్రిలో 17 పనులకు రూ.19 లక్షలు, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిలో 4 పనులకు రూ.16.09 లక్షలు, ప్రభుత్వ మానసిక వైద్యశాలల్లో 6 పనులకు రూ.34.54 లక్షలకు అనుమతులు మంజూరు చేశారు.

టైర్ పేలి స్కూటర్‌పైకి దూసుకొచ్చిన లారీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- రాయపురాజుపేట వద్ద రోడ్డు ప్రమాదం



మృతి చెందిన సాయి

చోడవరం: మండలంలోని రాయపురాజుపేట వద్ద నర్సాపురం–చొడువాడ రోడ్డులో మంగళవారం రాత్రి స్కూటర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కె.కోటపాడు మండలం పైడంపేట గ్రామానికి చెందిన కర్నాటక సాయి (22), లక్ష్మణ్ (22) కలిసి స్కూటీపై వెంకన్నపాలెం నుంచి వెళ్తున్నారు. చోడవరం మండలం రాయపురాజుపేట వద్దకు వచ్చేసరికి అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ టైర్ పేలిపోయి వీరి స్కూటీపైకి దూసుకొచ్చింది. దాంతో స్కూటీ నడుపుతున్న సాయి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మణ్‌కు కాళ్లు విరిగిపోవడంతో చోడవరం నుంచి వచ్చిన 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. చోడవరం సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు సాయి ఒక్కడే కొడుకు కావడంతో అకస్మాత్తుగా మృతి చెందడంతో శోకసముద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ప్రిన్సిపాల్ స్వామినాయుడు



భోగిమంట చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థులు

పరవాడ/సబ్బవరం: పరవాడ, సబ్బవరం మండలాల్లోని పలు పాఠశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. సబ్బవరం పాఠశాల ప్రిన్సిపాల్ స్వామినాయుడు భోగి, సంక్రాంతి విశిష్టతను వివరించారు. విద్యార్థులకు ముగ్గులు, గాలిపటాలు ఎగురవేయడం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు హరిదాసు, బసవన్న, బుడబుక్కలు, జంగందొర వేషధారణలో సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, డైరెక్టర్ ఉదయనాగశ్రీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

4వ సచివాలయంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : స్థానిక 4వ సచివాలయం పరిధిలోని కుమ్మరి వీధి, కోమటి వీధి, వడ్డి వీధుల్లో బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధికారి ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుంటారన్నారు ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. అలాగే కోటదిబ్బ వద్ద రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఈ సందర్భంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్డుకు శ్రీకారం



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : పటిష్ట రహదారుల నిర్మాణానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో రేబాక గ్రామంలో మంగళవారం రూ.4 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో ఈ రహదారి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సన్యాసమ్మ, ఎంపీటీసీ ఎం.సతోషం, పార్టీ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎం.సత్యనారాయణ,

సీఐటీయూ పతాకావిష్కరణ

కశింకోట : కశింకోటలో మంగళవారం సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, వాటిని నిరసిస్తూ జరిపే పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతిచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు తనూజ, శ్రీదేవి, భార్గవి, చిన్ని శ్యామల, సీహెచ్ అమ్మాజీ, లక్ష్మి, టి.శ్యామల, మహేశ్వరి, నాగమణి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8,565 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,560	3,760
మొదటి రకం	3,200	3,420
రెండో రకం	3,005	3,150
మూడో రకం	2,740	3,850

అనకాపల్లి సినిమాలు

ధమాకా	-రాజా
ప్రత్యర్థి	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్(తెలుగు)	-వెంకటేశ్వర
లవ్ టుడే	-శ్రీసత్య
అవతార్-2	-రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్, ఓ పాజిటివ్-39 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 441 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 457 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

ఏనుగుతునిలో పశువైద్య శిబిరం



ఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



పశువులకు మినరల్స్ ప్యాకెట్ల అందజేత

కశింకోట : రాష్ట్రంలో పశు పోషణకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు అన్నారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో మంగళవారం జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొప్పాక నాగమణి శిబిరాన్ని ప్రారంభించారు. 44 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మినరల్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంచార వాహనంలో అత్యవసర చికిత్సలు చేసేందుకు వైద్యులతోపాటు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పశు వైద్యం కోసం ఈ వాహనాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు కొప్పాక గణేష్, పశు సంవర్ధక శాఖ అనకాపల్లి సహాయ సంచాలకులు బి.సౌజన్య, పశు వైద్యాధికారులు చైతన్యమణి, భానుబాబు, సంధ్య, సిబ్బంది రాజేష్, అశ్విని, రూప, సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జెడ్సీని కలిసిన కార్పొరేటర్



జెడ్సీ రమణను సత్కరిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జెడ్సీ ఎస్.వెంకటరమణను మంగళవారం 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు వార్డు సమస్యలను వివరించారు. అనంతరం రమణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, పార్టీ నాయకులు బొండా శంకరరావు, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన కవులు

అనకాపల్లిటౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం సాహితీ మిత్రుల సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఆంగ్ల సంవత్సరం, సంక్రాంతిని ఆహ్వానిస్తూ పలువురు కవులు తమ కవితలు వినిపించారు. రచయిత జి.రంగబాబు కవితలను సమీక్షించారు. అంతకుముందు గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాస్ కవులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు యిమ్మిడిశెట్టి చక్రపాణి, కవులు మాధవీసనారా, శిష్టా తమ్మిరాజు, జీఎల్ఎన్ శాస్త్రి, గంపా శ్రీదేవి, కోరాడ అప్పలరాజు, ఆర్‌వీఎల్ గాయత్రి, డీఎల్ నారాయణ పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో అయ్యప్ప పూజలు

అనకాపల్లిటౌన్ : స్థానిక గౌరీసంఘంలో వేంచేసిన అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 14, 15 తేదీల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి బుద్ధ రమణాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి, ఆభరణాలతో స్వామివారిని ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. 15న మకర జ్యోతిదర్శన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సీడీపీవో



మునగపాకలో అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సీడీపీవో శ్రీలత

మునగపాక : అంగన్‌వాడీ సేవలను సక్రమంగా అందించాలని సీడీపీవో శ్రీలత కోరారు. మంగళవారం ఆమె మునగపాకలోని పూర్వపు హాస్టల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ఆడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంతమంది పిల్లలు కేంద్రానికి వస్తున్నారు. అలాగే బాలింతలు, గర్భిణుల సంఖ్యకు సంబంధించిన రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన సేవలందించాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

నలుగురికి కంటి శస్త్రచికిత్సలు



శస్త్రచికిత్స చేయించుకున్న వారితో రోటరీ క్లబ్ చైర్మన్ రవిరాం జవహర్

అనకాపల్లిటౌన్ : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం వైద్యాధికారి కె.కమలేశ్వరరావు నలుగురికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ నెల 9న జరిగిన నేత్ర శిబిరానికి 19 మంది హాజరయ్యారన్నారు. శిబిరంలో నలుగురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వారికి ఆపరేషన్లు నిర్వహించి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ రవిరాం జవహర్, క్లబ్ సభ్యులు, రోగులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల ద్వారా ఆదాయం రాబట్టాలి



మునగపాక సంపదతయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న నాగలక్ష్మి

మునగపాక : సంపదతయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని సంపద తయారీ కేంద్ర నిర్వహణ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. మునగపాకలోని సంపద తయారీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పై దృష్టి సారించాలన్నారు. పాలకులు, అధికారులు కేంద్రం ద్వారా ఆదాయం వచ్చేలా పాటుపడాలన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రం ద్వారా ఎంతమేర ఆదాయం సమకూరిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మునగపాక సంపద తయారీ కేంద్రం వద్ద జిల్లాకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ దిమ్మల అప్పారావు కృషిని అభినందించారు. ఆమె వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు, సచివాలయ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

14 నుంచి క్రికెట్ పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కోరిబిల్లి పరి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్టు సర్వేజన వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి అన్నారు. మంగళవారం మైదానంలో కప్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు పాల్గొన్నారు.

చలపతిరావు సేవలు ఎనలేనివి



చలపతిరావు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్థానిక బీజేపీ నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : దివంగత బీజేపీ నేత పి.వి చలపతిరావుకు అచ్యుతాపురం బీజేపీ మంగళవారం నివాళులు అర్పించింది. ఈ మేరకు మండల బీజేపీ కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు పి.వి. చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ అభివృద్ధికి నిస్వార్థంగా పని చేసిన నేత చలపతిరావు అని కొనియాడారు. అచ్యుత విద్యా సంస్థల అధినేత పల్లెల శేషగిరి, ప్రశాంతి విద్యా సంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు నేతగా ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాజాన రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజాన భాస్కర్‌రావు, మేరుగు కాసుబాబు, దొడ్డి వెంకట సత్యనారాయణ, పిట్టా దాసుబాబు, ఉమ్మిడి వెంకటేశ్వర్లు, అగ్గాల హనుమంతరావు, ఇబ్రహీం భాషా, బండారు కన్నంనాయుడు, రాజాన చిట్టిబాబు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌ను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్

మునగపాక : విశాఖ జిల్లాకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మునగపాక మండలం గంగాదేవిపేటకు చెందిన కాండ్రేగుల జగదీష్ మంగళవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సెషన్స్ జడ్జి కోర్టు పీపీగా నియమితులైన జగదీష్‌ను పలువురు అభినందిస్తున్నారు. దీనిలో భాగంగా అమర్‌నాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో జగదీష్ సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని అమర్‌నాథ్ ఆకాంక్షించారని జగదీష్ తెలిపారు.

పేరుకుపోతున్న చెత్త..



కోటవురట్లలోని తుపాకుల గెడ్డ వంతెన కింద పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల: మండల కేంద్రంలోని తుపాకుల గెడ్డ చెత్తతో నిండిపోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద యెత్తున చెత్త, ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయాయి. స్థానికంగా ఉన్న వర్తకులు చెత్తను తీసుకొచ్చి తుపాకుల గెడ్డలో వేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. భారీగా చెత్త, ప్లాస్టిక్ పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు చుట్టుముడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగా, ఆయుర్వేదంతో వ్యాధి నిరోధకత పెంపు



ఆయుర్వేదిక్ వైద్యం ఆవశ్యకతపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ లావణ్య



కన్నూరుపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో యోగా చేయిస్తున్న యోగా టీచర్

కశింకోట : పిల్లలకు చిన్నప్పటి నుంచి ఆయుర్వేదిక్ వైద్యం అందించడం పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య కోరారు. మండలంలోని కన్నూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య విధానం, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదం దేశీయ వైద్య విధానమని, దీనివల్ల సైడ్ ఎఫెక్టులు ఉండవన్నారు. విదేశీయులు సైతం ఆయుర్వేదం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను పరీక్షించి వ్యాధి నిరోధక మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యానికి ఉపయోగపడే యోగాపై చిన్నారులకు అవగాహన కలిగించారు. వారితో యోగాసనాలు వేయించారు. రోజూ పిల్లలతో ఆసనాలు వేయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రజనికుమారి, యోగా టీచర్ పి.సన్యాసినాయుడు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూడార్రై ఉత్సవం నేడు



కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయం



వేణుగోపాలస్వామి

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజున కూడార్రై పాశురం పఠించి, ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గోదాదేవిని వివాహం చేసుకోవడానికి రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజుగా కూడార్రై ఉత్సవాన్ని జరపనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామార్చన నిర్వహిస్తారు. బెల్లం, పంచదారలతో వేర్వేరుగా రెండు పెద్ద పాత్రల్లో పాయసం తయారు చేసి, సంప్రదాయ పూజలు చేసి ప్రజలకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. కూడార్రై ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.

అలాగే స్థానిక ధ్యాన మందిరంలో కూడా కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా..

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ వార్డు సభ్యులు



టీడీపీ వార్డు సభ్యునికి కండువా వేసి వైఎస్సార్ సీపీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): మూడేళ్ల జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించగలిగామని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి నవరత్నాల పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల బాగోగులను తెలుసుకున్నారు. ఎవరికైనా పథకాలు అందకుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పథకాల లబ్ధిలో ఎటువంటి రాజకీయాలు ఉండవని తెలిపారు. అందరికీ ఇళ్లు, ఆసరా లేని వారికి పింఛన్లు అందజేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటి స్థితి గతులపై ఆరా, సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

టీడీపీ కి చెందిన కాకి అప్పారావు, వడిశెల శంకర్‌రావులు ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన వారు అధికార పార్టీ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, సర్పంచ్ గండిబోయిన వెంకట్, ఎంపీటీసీ లాలంశ్రీను, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ముఖ్యమంత్రి చేయూత



ఎమ్మెల్యే కన్నబాబురాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న దివ్యాంగురాలు వాణి

యలమంచిలి : ఇటీవల యలమంచిలి పట్టణానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పట్టణానికి చెందిన మానసిక దివ్యాంగురాలు వాణీ సమస్యను తీసుకెళ్లి రూ.లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేయించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు)ను వాణీ తల్లిదండ్రులతో కలసి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు మట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులకు విద్య,ఉద్యోగ పరంగా అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధిక శాతంతో పింఛన్లు మంజూరు చేశారని, మానసికంగా దృఢ సంకల్పంతో దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటే ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట పాఠశాలలో చదువుతున్న వాణీకి ముఖ్యమంత్రి సహాయం చేయడం పట్ల ఉపాధ్యాయ బృందం సభ్యులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడు విశ్వేశ్వరావు పాల్గొన్నారు.